# ప్రార్థన - ప్రాశస్త్యము



సంకలనము

**తూములూరు ప్రభ**

# ప్రార్థన - ప్రాశస్త్యము



సంకలనము

**తూములూరు ప్రభ**

# ప్రార్థన - ప్రాశస్త్యము

సంకలనము:

**తూములూరు ప్రభ**

వెల: **రూ.5=00**

ప్రచురణ:

**తూములూరు పబ్లికేషన్స్**

'అనసూయ' సి-66, దుర్గాబాయ్‌దేశ్‌ముఖ్ కాలనీ

హైదరాబాద్ - 500 007

ఫోన్: 040-2742 7083, 27428904

ఇ-మెయిల్:hyd1_tumuluru@sancharnet.in

ముద్రణ:

**విప్ల కంప్యూటర్ సర్వీసెస్**

(డిజైనర్స్ & మల్టీకలర్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్)

నల్లకుంట, హైదరాబాద్- 500 044.

ఫోన్: +91-40-27676910, 55348445

ఇ-మెయిల్: viplavision@rediffmail.com

# నివేదన

నాల్గు వేదాలను, ఆరు శాస్త్రాలను పఠించినా, ఉపనిషత్తులు కంఠస్థం చేసినా, బ్రహ్మసూత్రాలు వల్లించినా, నారదునికి శాంతి కలుగలేదు. భ్రమ తొలగలేదు. తన అశాంతిని దూరం చేసుకొనేందుకు సనక, సనందన, సనత్కుమారులను ఆశ్రయించగా సనత్కుమారుడు ఉపనిషత్తులోని మొదటి వాక్యం 'ఈశావాస్యమిదం సర్వం'ను అనుభూతిలోకి తెచ్చుకుని, అన్నిటిలోను ఈశ్వరత్వ మున్నదనే సత్యాన్ని గుర్తించి, ఆచరణలో పెట్టడం ముఖ్యమనే విషయాన్ని జ్ఞాపకం చేసాడు. "గ్రంథ పరిచయంలో కాలం వ్యర్థం చేయటం కాక త్రికరణ శుద్ధిగా మంచిని వింటూ, మంచిని చెపుతూ, మంచిని చేసి చూపించటం (ఆచరణలో పెట్టటం) ముఖ్యం" అని భగవాన్ సత్యసాయి బాబా చెప్పి నట్లు జ్ఞానప్రాప్తి కుపకరించు ప్రస్థాన త్రయము – ఉపనిషత్తులు, గీత, బ్రహ్మ సూత్రములు పఠించుట కాక సాధన చతుష్టయమును సాధించి, ఆనందము, శాంతి పొందాలి.

సాధకులు మొదట వివేకము పెంపొందించుకోవాలి. నిత్య అనిత్య విషయము లను పరిశీలించి యోగ్యమైన దానిని అనుభవింప ప్రయత్నించుట; ఆ విధంగా తెలుసుకున్న తర్వాత ఎన్ని అవాంతరములు వచ్చినా చలించక, దానిని వదలకుండుట; భగవంతుడు భావప్రియుడు, కాని బాహ్యప్రియుడు కాడని తెలిసినను బాహ్యంలో కూడ భావం చేర్చి, మనోవాక్కాయ కర్మలందు ప్రేమతో శాంతిని పొందుట నిజమైన తపస్సు, యోగము అంటారు భగవాన్ బాబా. ఈ విధంగా చేసిన ఆధ్యాత్మిక సాధనతో జీవితములోని శారీరక, మానసిక బాధలను అధిగమించి, భీష్మునివలె ఉత్తమ కాలము వచ్చునంతవరకు ఓపిక పట్టి, ఉత్తమ కాలము రాగానే నీలో చేర్చుకొనుమని భగవంతుని స్మరణతో ప్రార్థించాలి. ఆ ప్రార్థనా ప్రక్రియలో భగవంతునిపై స్తోత్రములు, భగవతుని గురించిన గీతములు, పాటలు, పద్యాలు మొదలైనవి ఉపకరిస్తాయి.

'పాలు త్రాగటం నాకు అలవాటు, విషం త్రాగటం నీకు అలవాటు" అని శ్రీకృష్ణుడు, శివునితో అన్నాడట.

ఏది ఏమైనా సమగ్ర ఐశ్వర్య సంపన్నులు వారు. వారిని "అలక్ష్యం చెయ్యకుండా" మన భగవాన్ మధురంగా గానం చేసినట్లు, "రామా, కోదండ రామా, రామా పట్టాభిరామా... కళ్యాణ రామా... నీ కంట చూడు... నా చింతనే బాపు... నీ చింతనె చాలు... నీ నామమే మేలు... రామా నేను నీవాడ... రామా నాతో మాటాడు..." అని గానం చేయలేకపోయినా, నీ నామమే మేలు, నీ నామమే చాలు" అని పవిత్ర రామ నామాన్ని ప్రార్థించు కుంటూ ఉంటే చాలు. అష్టాక్షరి– 'నమో నారా యణాయ'లోని 'ర' కారము, పంచాక్షరి– 'నమఃశివాయ' లోని 'మ' కారము చేరిన 'రామ' అను మంగళనామం– నామస్మరణతో అన్ని శుభాల్ని, సుఖాల్ని, ఆనందాన్ని, శాంతినీ పొందగల్గుతాము.

**శుభం**



# భగవంతుని స్తోత్రము

"అతడే ఇతడు"

మన ఇంటి వెలుగు-మన కంటి జ్యోతి
మన ఆత్మ అతడే పరమాత్మ అతడే
పరంధాముడతడే, సచ్చిదానంద చిన్మయ రూపుడతడే
మన వెంట కంట ఇంట జంట నుండు నాథుడతడే
మన పూజమందిరము వాకిట మన కోర్కెల తీర్చుటకు
వేచియున్న సాయినాథుడతడే - అనాథ నాథుడతడే
పర్తివాసుడతడే కరుణామయుడు -
అతడే ఇతడు, ఇతడే అతడు.

10.12.2003 - తూములూరు కృష్ణమూర్తి



# కృతజ్ఞతాంజలి

"బ్రహ్మాండ మంతట ప్రబలుచుండెడి నీకు
ఆలయంబునమర్చనలవియగునె?
కోటి సూర్యుల కాంతి మేటివయిన నీకు
ప్రమిద దీపంబెట్లు పెట్టగలను?
సర్వజీవులయందు సంచరించెడు నీకు
సరియైన పేరిడ సాధ్యమగునె?
వసుధ తెలుసు కొన్నది సాయిబాబయనుచు
ఇతరమైనది నేనేమి ఎరుగనయ్య.
సర్వమును నీవెయని నిన్ను సన్నుతింతు
మరువనెపుడు బాబ, నా మనసు తీర
ముంచు నీళ్లనొ, పాలనో విడువనెపుడు"

అని బాబా మీద దృఢ నమ్మకంతో, భక్తితో, ప్రేమతో నున్న మానవునకు మానవత్వాన్ని, దివ్యత్వాన్ని ఎరుక

పరుస్తూ సద్గతిని కూడా భగవాన్ కలుగచేస్తారు. దీనితో స్వామి చిన్నప్పుడు పాడినట్లు "అహరహతవ ఆహ్వాన ప్రచారిత; సునిశిత ఉదారవాణి; హిందు, బౌద్ధ, సిక్, జైన పారశీక; ముసల్మాన్ కిరస్తానీ అను ఏకాత్మ భావం పాడుకొనేటట్లు చేస్తారు. ఆ విధంగా వారి చల్లని నీడలో, అమ్మ ఒడిలోని ఉగ్గుపాలతో పెరిగి ప్రయోజకులైన బిడ్డల్లా, మనమూ ఒకరముగా గణనకు రాగల మను భావంతో భగవాన్‌కి ప్రేమపూర్వక కృతజ్ఞతాంజలులర్పిస్తున్నాను.

దీని ముద్రణ వరకూ స్ఫూర్తినీ, సహాయ సహకారాల్నీ అందించిన అందరికీ కృతజ్ఞతాభి వందనలు.

- తూములూరు ప్రభ



# ప్రార్థన అంటే...

ప్రార్థన కేవలం భగవంతునితో ప్రత్యక్షంగా సంభాషిస్తున్నట్లుగా ఉండాలి. మానవుడు తన దగ్గర ఏది లేదో దానికోసం ప్రార్థించాలి. ప్రేమ లేదు, శాంతి లేదు– ఆనందం లేదు. అవన్నీ భగవంతుని దగ్గరే ఉన్నాయి. కనుక వాటి నిమిత్తమై భగవంతుని ప్రార్థించాలి. మానవుని దగ్గర సంతోషం ఉంది. కాని ఆనందం లేదు. సంతోషం తనకు సంబంధించినది. ఆనందం హృదయానికి సంబంధించినది. నాకు ఆనందాన్ని, శాంతిని, ప్రేమను ప్రసాదించు అని మానవుడు నిరంతరం ప్రార్థించాలి. భగవంతుడు ఎప్పుడూ తనలోనే, తన వెంటే ఉంటాడను దృఢ మైన నమ్మకంతో ఉంటే భగవంతుడు తప్పక తన అనుగ్రహాన్ని అందిస్తాడు.

భగవంతుని అందరూ – అన్ని మతాలవారు, జాతుల వారు కులాలవారు, వర్గాలవారు ప్రార్థిస్తూనే ఉంటారు, వారికి వచ్చిన భాషతో, తెలిసిన పద్ధతిలో.

కాని కేవలం పెదవుల నుంచి కాక, హృదయం నుంచి రావాలి. పెదవుల నుంచి మాత్రమే వస్తే “అడుక్కోటం, యాచించటం, వ్యాపారం చేయటం” అవుతుంది. అలా కాకుండా హృదయంతో తన బాధల్ని, ఆవేదనని, ఆర్తిని తను నమ్మిన భగవంతునితో చెప్పుకుంటుంటే భగవంతుడు తన ప్రార్థనకు స్పందించి, సంకల్పించి, దివ్య అనుగ్రహాన్ని తప్పక అందిస్తాడనే విశ్వాసంతో ప్రశాంతత వస్తుంది.

అంతేకాని ఏ విధంగా, ఎవరిని ప్రార్థిస్తున్నారనేది ముఖ్యం కాదు. ఎవరిని ప్రార్థిస్తున్నామని కూడా వెరవ నక్కర్లేదు. హృదయానికి హృదయం; ప్రేమకు ప్రేమగా చేసే ‘అర్థింపు’కి వెన్నకంటె మెత్తని మనస్సు, సున్నిత హృదయం గల స్వామి మాత్రం స్పందించకుండా, సంకల్పించకుండా ఉండరు కదా!

ప్రేమతో హృదయ పూర్వకంగా ప్రార్థిస్తూ ఉండటమే మనం చేయవలసిన పని!!

## ప్రతి నిత్యం చేయు కొన్ని ప్రార్థనలు

మంత్రాలు, స్తోత్రాలు, శ్లోకాలు, ప్రార్థనలు, భజనలు, కీర్తనలు మొదలైనవి మొదలు పెట్టేముందు 'ఓం'కారంతో ప్రారంభిస్తారు; సామూహికంగా కూడా. ఓంకారోచ్ఛారణ ఏమిటి, ఎలా– చూడండి.

### ఓంకారోచ్ఛారణ:

సృష్టి ప్రారంభమున వెలువడిన శబ్దము ఓమ్. అదే ప్రణవము. ఆది శబ్దము. దీనికి మార్పు లేదు. నాశనము లేదు. దీని నుండి వెలువడిన మిగిలిన శబ్దములు మార్పు చెందును. అందుచే ఓంకారము బ్రహ్మ స్వరూపము. సత్యసాయియే ఆ ఓం కార రూపుడు.

సృష్టిలో మూడు అంశములున్నవి. అవి

1) సృష్టి – పుట్టుట

2) స్థితి – పెరుగుట

3) లయము–నశించుట, ఈ మూడు బ్రహ్మ, విష్ణు,

మహేశ్వరులకు సంకేతములు. మరియు 'ఓం' లోని అకార, ఉకార, మకార శబ్దములు ఈ మూడు అంశములు సూచించును.

'అ' శబ్దము గొంతు నుండి ప్రారంభింపవలెను (నెమ్మదిగా)

'ఉ' శబ్దము నాలుక నుండి (కొంచెం బిగ్గరగా)

'మ' శబ్దము పెదవులనుండి వెలువడును (మృదువుగా)

'ఓం' ఉచ్ఛరించునపుడు మొట్టమొదట, దూరం నుండి విమానం వచ్చినప్పటి శబ్దమువలె ప్రారంభమై, క్రమేపి విమానం మన దగ్గరగా సమీపించునప్పటి శబ్దము వలెనుండి, రానురాను, విమానం మన నుండి దూరంగా వెళ్లిపోయినప్పటి శబ్దముగా నుండవలెను. ఈ మూడు రకముల శబ్దములు చేరి 'ఓమ్' అగును. మన శరీరములో, 21 అంశల చిహ్నముగా 'ఓం'ను 21 సార్లు ఉచ్ఛరించవలెను. ఆ 21 అంశలు.

1) ఐదు కర్మేంద్రియములు (నోరు, చేతులు, కాళ్లు, విసర్జన ఇంద్రియములు, రహస్యావయవములు).

– వాక్కు, పాణి, పాదము, పాయువు, ఉపస్థము.

2) ఐదు జ్ఞానేంద్రియములు–నాలుక, ముక్కు, చెవులు, కళ్లు, చర్మము.

3) మనస్సు (సంకల్పములు)

4) పంచ ప్రాణములు ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమాన.

5) పంచ కోశములు – అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ.

'శాంతి, శాంతి, శాంతి' అని ముగించవలెను. శారీరక (ఆధిభౌతిక), మానసిక (ఆధిదైవికము), ఆత్మా నందము (ఆధ్యాత్మికము) కొరకు మూడుసార్లు శాంతిని చెప్పవలెను.



# శ్రీ సత్యసాయి సుప్రభాతము

**సుప్రభాతము యొక్క అంతరార్థము:**

సుప్రభాతము పఠించునప్పుడు, భగవంతుడు మనలోనే ఉన్నాడని విశ్వసించాలి. మన ద్వారా మన ఇంద్రియముల ద్వారా అన్ని పనులు చేయువాడు అతడే. మనం చేసే ప్రతి పని పవిత్రంగా, దివ్యంగా ఉండేటట్లుండాలి. మనం ఏదైనా పని చేయాలనుకున్న, ఆలోచన పెట్టుకున్న సాయి ఆలోచనలకి, ఆచరణకి అనుగుణంగా ఉండేటట్లు చూచుకోవాలి. క్రొత్త దినము ప్రారంభించునపుడు, ప్రాతః కాలమున 'సుప్రభాతము' పఠించి, మనలోనే నివసిస్తున్న (అంతర్యామిగా ఉంటున్న) స్వామిని జ్ఞాపకం చేసుకోవాలి.

మనలో ప్రతి ఒక్కరూ ఈశ్వరమ్మ బిడ్డలే. మనం అందరం దివ్యాత్మ స్వరూపులమే. మన శరీరమే పుట్టపర్తి. మన ఇంద్రియములే పుట్టపర్తిలో వేచియున్న భక్తులు. మన కర్మలే మనం భగవంతునకి అర్పించు పండ్లు పువ్వులు.

ఈ విధంగా ప్రతి దినము మానవుడు తనలోని భగవంతుని మేల్కొలిపిన, జ్ఞాన (జ్ఞానము), విజ్ఞాన (వైజ్ఞానికము), సుజ్ఞాన (ఆధ్యాత్మిక), ప్రజ్ఞాన(దైవిక) ములతో వెలుగొంది మోక్షమును (ముక్తి) పొందును.

## భగవాన్ శ్రీ సత్యసాయి సుప్రభాతము

**1.** **ఈశ్వరాంబా సుతశ్రీమాన్**
**పూర్వా సంధ్యా ప్రవర్తతే**
**ఉత్తిష్ఠ సత్య సాయీశ**
**కర్తవ్యం దైవ మాహ్నికమ్.**

ఈశ్వరమ్మ పుత్రుడవై అవతరించిన ఓ, సత్య సాయి భగవానుడా! తూర్పు దిక్కున తెల్లవారినది. ప్రతి దినము చేయు దివ్య కార్యములను నిర్వహించుటకు లెమ్ము.

**2.** **ఉత్తిష్ఠోత్తిష్ఠ పర్తీశ**
**ఉత్తిష్ఠ జగతీపతే**
**ఉత్తిష్ఠ కరుణా పూర్ణ**
**లోకమంగళ సిద్ధయే.**

పుట్టపర్తిలో ప్రభవిల్లిన సత్యసాయీశ్వరా! లెమ్ము. లే లెమ్ము. ఓ, జగన్నాధా లెమ్ము. ఓ, కరుణానిధీ, లోక కళ్యాణము సిద్ధింప చేయుటకు లెమ్ము.

**3. చిత్రావతీ తట విశాల సుశాంత సౌధే**
**తిష్ఠన్తి సేవక జనాస్తవ దర్శనార్థమ్,**
**ఆదిత్య కాంతి రను భాతి సమస్త లోకాన్**
**శ్రీ సత్యసాయి భగవన్ తవ సుప్రభాతమ్.**

చిత్రావతీ నదీ తీరమున నున్న విశాలమైన ప్రశాంతి నిలయమున నీ సేవకులైన భక్తులు. నీ దర్శనమునకై నిరీక్షించుచున్నారు. ఉదయారుణ కాంతులతో ప్రపంచమంతయు వెలుగొందు చున్నది. ఓ, సత్యసాయి భగవానుడా, నీకు సుప్రభాతము.

**4. త్వన్నామ కీర్తన రతాస్తవ దివ్యనామ**
**గాయన్తి భక్తిర సపాన సుహృష్ట చిత్తాః**
**దా తుంకృపా సహిత దర్శన మాశుతేభ్యః**
**శ్రీ సత్యసాయి భగవన్ తవ సుప్రభాతమ్.**

భక్తులు నీ దివ్య నామ కీర్తనమును ఎంతో ఆసక్తికరముగ చేయుచు, భక్తి పారవశ్యములో ఓలలాడుచున్నారు. దయతో నిండిన నీ దర్శన భాగ్యమును వారికి అనుగ్రహించమని ప్రార్థిస్తున్నారు. ఓ, సత్యసాయి ప్రభూ, నీకు సుప్రభాతము.

**5. ఆదాయ దివ్య కుసుమాని మనోహరాణి**
**శ్రీపాద పూజన విధిమ్ భవదంఘ్రిమూలే,**
**కర్తుం మహోత్సుకతయా ప్రవిశన్తి భక్తాః**
**శ్రీ సత్యసాయి భగవన్ తవ సుప్రభాతమ్**

నీ పాద పూజా కార్యక్రమము సక్రమంగా నిర్వర్తించుటకు, నీ భక్తులు ఎంతో ఉత్సాహముతో, మనోహరములైన దివ్య పుష్పములచే గాచి యున్నారు. ఓ, సత్యసాయి భగవానుడా! నీకు సుప్రభాతము.

**6. దేశాంత రాగత బుధాస్తవ దివ్యమూర్తిమ్**
**సందర్శనా భిరతి సంయుత చిత్త వృత్త్యా**

**వేదోక్త మంత్ర పఠనేన లసంత్య జస్రం**
**శ్రీ సత్యసాయి భగవన్ తవ సుప్రభాతమ్.**

నీ దివ్యమూర్తిని సందర్శించు తీవ్ర కోరికతో దేశ దేశముల నుండి వచ్చిన పండితులు వేదోక్తమైన మంత్రములను అనవరతము పఠించుచున్నారు. ఓ, సత్యసాయి ప్రభూ, నీకు సుప్రభాతము.

**7. శ్రుత్వా, తవాద్భుత చరిత్రమ ఖండ కీర్తిం**
**వ్యాప్తాందిగంతర విశాల ధరాత లేస్మిన్**
**జిజ్ఞాసు లోక ఉపతిష్ఠతి చాశ్రమేస్మిన్**
**శ్రీ సత్యసాయి భగవన్ తన సుప్రభాతమ్.**

నీ అద్భుత చరిత్ర, అఖండ కీర్తి దిగ్దిగంత రాళములలోను, విశాల ప్రపంచములోను వ్యాపించి యున్నది. జిజ్ఞాసువులైన ప్రజలు నీ ఆశ్రమమున చేరియున్నారు. ఓ, సత్యసాయి భగవానుడా, నీకు సుప్రభాతము.

**8. సీతాసతీ సమవిశుద్ధ హృదంబు జాతా**
**బహ్వాంగణ కరగృహీత సుపుష్పహారా**

**స్తున్వన్తి దివ్యనుతిభిః ఫణిభూషణం త్వాం**
**శ్రీ  సత్యసాయి భగవన్ తవ సుప్రభాతమ్.**

మహాసాధ్వియగు సీతాదేవిని పోలిన పవిత్ర హృదయులైన స్త్రీలు, చేతులలో మనోహరములైన పూలమాలలను పట్టుకుని, దివ్య స్తోత్రములతో నిన్ను ఫణి భూషణుడవని, సర్పములు అలంకారముగా గల శివుడవనీ, స్తోత్రము చేయుచున్నారు. ఓ, సత్యసాయీశా, నీకు సుప్రభాతము.

**9. సుప్రభాతమిదం పుణ్యం**
**యే పఠన్తిదినేదినే**
**తేవిశన్తి పరంధామ**
**జ్ఞాన విజ్ఞాన శోభితా.**

పవిత్రమైన ఈ సుప్రభాతమును ప్రతి దినము ఎవరు పఠింతురో, వారు ఐహిక, పారమార్థిక జ్ఞానములచే విరాజిల్లుచూ, ఉత్తమ గతిని పొందుదురు.

**10. మంగళం గురు దేవాయ**
**మంగళం జ్ఞాన దాయినే**

**మంగళం పర్తి వాసాయ**
**మంగళం సత్య సాయినే.**

గురు దేవునకు మంగళము.
జ్ఞాన ప్రదాతకు మంగళము.
పుట్టపర్తి నివాసునకు మంగళము.
శ్రీ సత్యసాయీశ్వరునకు శుభమంగళము.

## అష్టోత్తర శతనామ రత్నమాల

**ఓం:**

ఆది శబ్దము, సర్వత్రా వ్యాపించినటువంటిది (యోగములో మానవుని వెన్నెముక కేంద్ర భాగము) ఆ పరబ్రహ్మ యొక్క ముఖ్యమైన సంకేతము ఓంకారము మరియు బాబాది కూడా.

**శ్రీ:**

అన్ని రకములయిన ఐశ్వర్యము.

**నమః**

చేతులు జోడించి శిరస్సు వంచుట 10 వ్రేళ్లు కలిపినపుడు కర్మేంద్రియ, జ్ఞానేంద్రియములు భగవంతునికి అర్పించుట. 'నమః'కు బాబా చెప్పినది. ఇంద్రియములు మనసుతో కలిపి భగవంతుని కర్పించుట. న-మమ=నాది కాదు, మీది అనెడి శరణాగతి తెల్పు క్రియ నమస్కారము.

**1. ఓం శ్రీ సత్య సాయిబాబాయనమః**

మనందరికి దివ్య మాత, పిత అయిన బాబాకు నమస్కరిస్తున్నాము.

**2. ఓం శ్రీ సత్య స్వరూపాయనమః**

సత్యమే స్వరూపముగా కలవాడు.

**3. ఓం శ్రీ సత్యధర్మ పరాయణాయ నమః**

సత్య, ధర్మములు నెలకొల్పుటయందు అచంచల దీక్ష కలవాడు.

**4. ఓం శ్రీ వరదాయనమః**

వరములను యిచ్చువాడు, వరప్రదాత.

**5. ఓం శ్రీ సత్పురుషాయనమః**

నిత్యుడై వెలుగొందు సత్‌పురుషుడు.

**6. ఓం శ్రీ సత్య గుణాత్మనేనమః**

సద్గుణములు, సత్శీలము కలిగియుండు వాడు.

**7. ఓం శ్రీ సాధువర్ధనాయనమః**

సద్గుణములను పెంపొందించువాడు.

**8. ఓం శ్రీ సాధుజన పోషణాయనమః**

సజ్జనులను సంరక్షించువాడు.

**9. ఓం శ్రీ సర్వజ్ఞాయనమః**

అన్నిటినీ తెలిసినవాడు.

**10. ఓం శ్రీ సర్వజన ప్రియాయనమః**

సర్వులకూ(అందరికి) ప్రియమైనవాడు.

**11. ఓం శ్రీ సర్వశక్తి మూర్తయేనమః**

సర్వశక్తులకు నిలయమైనటువంటివాడు.

**12. ఓం శ్రీ సర్వేశాయనమః**
స్వామి సర్వదేవతా స్వరూపుడు.

**13. ఓం శ్రీ సర్వసంగ పరిత్యాగినేనమః**
అన్ని బంధములు వదిలినవాడు (విరాగి)

**14. ఓం శ్రీ సర్వాంతర్యామినేనమః**
సర్వ జీవుల హృదయములందు వుండువాడు.

**15. ఓం శ్రీ మహిమాత్మనేనమః**
మహిమలు కలవాడు. (దివ్య ఆత్మ)

**16. ఓం శ్రీ మహేశ్వర స్వరూపాయనమః**
శివ స్వరూపుడు.

**17. ఓం శ్రీ పర్తి గ్రామోద్భవాయనమః**
పర్తి అను పేరు గల గ్రామమున జన్మించినవాడు.

**18. ఓం శ్రీ పర్తి క్షేత్ర నివాసినేనమః**
పర్తి క్షేత్రములో నివసించువాడు.

**19. ఓం శ్రీ యశః కాయ షిర్డి వాసినేనమః**
పూర్వ శరీరములో షిర్డి నివాసిగా కీర్తి పొందినవాడు.

**20. ఓం శ్రీ జోడి ఆదిపల్లి సోమప్పాయనమః**
ఒక భక్తుని బిడ్డను రక్షించు లీలలో ఈ పేరు ధరించెను.

**21. ఓం శ్రీ భారద్వాజ ఋషిగోత్రాయనమః**
భరద్వాజ ఋషి గోత్రమునందు జన్మించినవాడు.

**22. ఓం శ్రీ భక్తవత్సలాయనమః**
భక్తులయందు వాత్సల్యము, ప్రేమ కలిగినవాడు.

**23. ఓం శ్రీ అపాంతరాత్మనేనమః**
1. సంసార సముద్రము దాటి మనల దాటించువాడు.
2. అందరియందు వుండువాడు.

**24. ఓం శ్రీ అవతార మూర్తయేనమః**
అవతారములకు మూర్తియైనవాడు.

**25.** **ఓం శ్రీ సర్వభయ నివారిణేనమః**
అన్ని విధములైన భయములను తొలగించువాడు.

**26.** **ఓం శ్రీ ఆపస్తంబ సూత్రాయనమః**
ఆపస్తంబ సూత్రాకారుని సంప్రదాయములో జన్మించెను.

**27.** **ఓం శ్రీ అభయ ప్రదాయనమః**
శరణు కోరినవారికి అభయమునిచ్చువాడు, రక్షించువాడు.

**28.** **ఓం శ్రీ రత్నాకర వంశోద్భవాయనమః**
రత్నాకర వంశమున జన్మించినవాడు.

**29.** **ఓం శ్రీ షిర్డిసాయి అభేద శక్త్యావతారాయనమః**
షిర్డిసాయి మహిమకు, కీర్తికి భిన్నము కానటువంటిది.

**30.** **ఓం శ్రీ శంకరాయనమః**
శివ స్వరూపుడు.

**31. ఓం శ్రీ షిర్డి సాయిమూర్తయేనమః**

షిర్డిసాయి యొక్క అవతారమే శ్రీ సత్యసాయి.

**32. ఓం శ్రీ ద్వారకామాయి వాసినేనమః**

ద్వారకామాయియందు నివసించువాడు.

**33. ఓం శ్రీ చిత్రావతీ తట పుట్టపర్తి విహారిణేనమః**

పుట్టపర్తివద్ద గల చిత్రావతీ నదిఒడ్డున లీలలు చూపినవాడు. (లేక) విహరించినవాడు.

**34. ఓం శ్రీ శక్తి ప్రదాయనమః**

శక్తిని యిచ్చువాడు. (ధార్మికశక్తి)

**35. ఓం శ్రీ శరణాగత త్రాణాయనమః**

శరణు కోరినవారిని రక్షించువాడు.

**36. ఓం శ్రీ ఆనందాయనమః**

ఆనందస్వరూపుడు.(బ్రహ్మానందము)

**37. ఓం శ్రీ ఆనందాయనమః**

ఆనందమును అందించు (యిచ్చు)వాడు.

**38. ఓం శ్రీ ఆర్తత్రాణ పరాయణాయనమః**

దుఃఖములలో, బాధలలో వున్నవారిని
ప్రత్యేకముగ రక్షించువాడు.

**39. ఓం శ్రీ అనాథనాథాయనమః**

దిక్కులేనివారికి ప్రభువు, రక్షకుడు.

**40. ఓం శ్రీ అసహాయ సహాయాయనమః**

(నిస్సహాయులకు) సహాయము లేనివారికి
సహాయకుడు.

**41. ఓం శ్రీ లోక బాంధవాయనమః**

ప్రపంచమంతా బంధువులు, స్నేహితులు కలవాడు.

**42. ఓం శ్రీ లోక రక్షాపరాయణాయనమః**

ప్రజలను రక్షించుటయందు పూర్తిగా
లీనమయినవాడు.

**43. ఓం శ్రీ లోక నాథాయనమః**

ప్రపంచమునకు (జగత్తు) నకు ప్రభువు.

**44. ఓం శ్రీ దీనజన పోషణాయనమః**

దుఃఖితులను, దీనులను పోషించి కాపాడుటకు ఆధారమయినవాడు.

**45. ఓం శ్రీ మూర్తిత్రయ స్వరూపాయనమః**

త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల దివ్య అవతారము.

**46. ఓం శ్రీ ముక్తి ప్రదాయనమః**

మోక్షమునిచ్చువాడు, జనన మరణముల నుండి (విడుదల) విమోచనము యిచ్చువాడు.

**47. ఓం శ్రీ కలుష విదూరాయనమః**

దుర్మార్గములను, లోపములను తొలగించు వాడు.

**48. ఓం శ్రీ కరుణా కరాయనమః**

దయ కలిగినటువంటివాడు.

**49. ఓం శ్రీ సర్వాధారాయనమః**

అందరికీ, అన్నిటికీ ఆధారమయినటు వంటివాడు.

**50.** **ఓం శ్రీ సర్వహృద్వాసినేనమః**
సర్వజీవుల హృదయములలోను నివసించువాడు.

**51.** **ఓం శ్రీ పుణ్యఫల ప్రదాయనమః**
సత్కర్మలకు ఫలితములు యిచ్చువాడు.

**52.** **ఓం శ్రీ సర్వపాప క్షయకరాయనమః**
సర్వ పాపములను నశింపచేయువాడు.

**53.** **ఓం శ్రీ సర్వరోగ నివారిణేనమః**
శారీరక, మానసిక రోగములను నయము చేయువాడు.

**54.** **ఓం శ్రీ సర్వబాధ హరాయనమః**
అన్ని విధములయిన బాధలనుండి రక్షించువాడు.

**55.** **ఓం శ్రీ అనంతనుత కర్తృణేనమః**
సృష్టికర్త, అంతము లేకుండా స్తుతించ (పొగడ) బడువాడు.

**56. ఓం శ్రీ ఆదిపురుషాయనమః**

పురాణపురుషుడు, సనాతనుడు.

**57. ఓం శ్రీ ఆదిశక్తయేనమః**

ప్రథమ, లేక తొలిశక్తి. (ఆది దేవత)

**58. ఓం శ్రీ అపరూప శక్తినేనమః**

ఆనంద, ఆశ్చర్యములు కల్గించేవి, సాటిలేనివి అయిన దివ్య శక్తులు కలవాడు.

**59. ఓం శ్రీ అవ్యక్త రూపిణేనమః**

నిరాకారుడు.

**60. ఓం శ్రీ కామక్రోధ ధ్వంసినేనమః**

మనలోని కోరికలను, కోపమును నశింపచేయువాడు.

**61. ఓం శ్రీ కనకాబరధారిణేనమః**

బంగారు రంగు వస్త్రములు ధరించువాడు.

**62.** **ఓం శ్రీ అద్భుత చర్యాయనమః**
ఆశ్చర్యము కలిగించు పనులు (లీలలు) చేయువాడు.

**63.** **ఓం శ్రీ ఆపద్బాంధవాయనమః**
ఆపదలయందు బంధువుగా కాపాడువాడు.

**64.** **ఓం శ్రీ ప్రేమాత్మనేనమః**
ప్రేమ స్వరూపముగా గలవాడు.

**65.** **ఓం శ్రీ ప్రేమ మూర్తయేనమః**
ప్రేమ స్వభావముగా గలవాడు.

**66.** **ఓం శ్రీ ప్రేమ ప్రదాయనమః**
ప్రేమను అనుగ్రహించువాడు.

**67.** **ఓం శ్రీ ప్రియాయనమః**
అందరిచేత ప్రేమించబడువాడు.

**68.** **ఓం శ్రీ భక్త ప్రియాయనమః**
భక్తులను, ప్రేమించువాడు, రక్షించువాడు.

**69. ఓం శ్రీ భక్త మందారాయనమః**
భక్త జనులకు స్వర్గమువంటివాడు.

**70. ఓం శ్రీ భక్తజన హృదయ విహారిణేనమః**
భక్తుల హృదయములలో ఆనందముతో ఆడుచూ తిరుగువాడు.

**71. ఓం శ్రీ భక్త జన హృదయాలయాయనమః**
భక్తుల హృదయములలో వసించువాడు.

**72. ఓం శ్రీ భక్తపరాధీనాయనమః**
భక్తులకు వశమైనవాడు, భక్తజన సులభుడు.

**73. ఓం శ్రీ భక్తిజ్ఞాన ప్రదీపాయనమః**
భక్తి, జ్ఞానములను దీపకళికలను వెలిగించి ప్రకాశింపచేయువాడు.

**74. ఓం శ్రీ భక్తిజ్ఞాన ప్రదాయనమః**
భక్తి మార్గమును మనకు చూపించి దాని ద్వారా జ్ఞానమును అందించువాడు.

**75.** **ఓం శ్రీ సుజ్ఞాన మార్గదర్శకాయనమః**
ఆత్మ జ్ఞానమును పొందు మార్గమును చూపించువాడు.

**76.** **ఓం శ్రీ జ్ఞాన స్వరూపాయనమః**
మూర్తీభవించిన జ్ఞానరూపుడు, జ్ఞానమే స్వరూపంగా కలవాడు.

**77.** **ఓం శ్రీ గీతా బోధకాయనమః**
గీతాచార్యుడు, గీతను బోధించినవాడు.

**78.** **ఓం శ్రీ జ్ఞాన సిద్ధిదాయనమః**
విజ్ఞాన సిద్ధిని అనుగ్రహించువాడు.

**79.** **ఓం శ్రీ సుందర రూపాయనమః**
ఆకర్షణీయమైన, మనోహరమైన రూపము గలవాడు.

**80.** **ఓం శ్రీ పుణ్య పురుషాయనమః**
పవిత్ర స్వరూపుడు (భౌతిక సౌందర్యము, మృదువుగా మాట్లాడుట, దయ మొ॥)

**81. ఓం శ్రీ ఫలప్రదాయనమః**

మనము చేయు సత్కర్మ, దుష్కర్మ రెండింటికి ఫలితము యిచ్చువాడు.

**82. ఓం శ్రీ పురుషోత్తమాయనమః**

పురుషులలో ఉత్తముడు.

**83. ఓం శ్రీ పురాణ పురుషాయనమః**

జననాది వికారములు లేక శాశ్వతముగ వుండువాడు (సనాతనుడు)

**84. ఓం శ్రీ అతీతాయనమః**

సర్వాతీతుడు.

**85. ఓం శ్రీ కాలాతీతాయనమః**

త్రికాలములకు లోబడనివాడు.

**86. ఓం శ్రీ సిద్ధి రూపాయనమః**

సకల సిద్ధులు స్వరూపముగా గలవాడు.

**87. ఓం శ్రీ సిద్ధ సంకల్పాయనమః**
ఆయన సంకల్పము వెంటనే నెరవేరును.

**88. ఓం శ్రీ ఆరోగ్య ప్రదాయనమః**
ఆరోగ్యమును అనుగ్రహించువాడు.

**89. ఓం శ్రీ అన్న వస్త్రదాయినేనమః**
సమస్త జీవరాసులకు పోషకుడు, ఆహార, వస్త్రములిచ్చువాడు.

**90. ఓం శ్రీ సంసార దుఃఖ క్షయకరాయనమః**
సంసార దుఃఖమును నశింపచేయువాడు.

**91. ఓం శ్రీ సర్వాభీష్ట ప్రదాయనమః**
కోరదగిన కోరికలను అందరికి అనుగ్రహించు వాడు.

**92. ఓం శ్రీ కల్యాణ గుణాయనమః**
స్వామి సద్గుణములన్నియు మేలు చేయునట్టివి.

**93. ఓం శ్రీ కర్మ ధ్వంసినేనమః**
కర్మ అను బంధమును నశింపచేసి మనను రక్షించెదరు.

**94. ఓం శ్రీ సాధు మానస శోభితాయనమః**
సాధు గుణములలో నిండియున్న వారి అంతరంగములను ప్రకాశించువాడు.

**95. ఓం శ్రీ సర్వమత సమ్మతాయనమః**
అన్ని మతములను అంగీకరించువాడు.

**96. ఓం శ్రీ సాధు మానస పరిశోధకాయనమః**
సాధుజనుల మనసులలో దురాలోచనలు రాకుండా శుభ్రపరచువాడు.

**97. ఓం సాధకానుగ్రహ వటవృక్ష ప్రతిష్టాపకాయనమః**
సాధకుల అనుకూలముగా మఱ్ఱిచెట్టును నాటిరి.

**98. ఓం శ్రీ సకల సంశయ హరాయనమః**
అన్ని రకముల సందేహములను తొలగించుదురు.

**99. ఓం శ్రీ సకల తత్వబోధకాయనమః**
సమస్త తత్వముల (జ్ఞానముల) సారమును అనుగ్రహించును.

**100. ఓం శ్రీ యోగీశ్వరాయనమః**
యోగులందరికి ప్రభువైనవాడు.

**101. ఓం శ్రీ యోగీంద్ర వందితాయనమః**
సమస్త యోగములలో నిపుణులైన యోగీంద్రులచే నమస్కరింపబడువాడు.

**102. ఓం శ్రీ సర్వ మంగళకరాయనమః**
సమస్త శుభములను, మంగళములను యిచ్చును. (అనుగ్రహించును)

**103. ఓం శ్రీ సర్వసిద్ధి ప్రదాయనమః**
అన్ని విధములైన నైపుణ్యములను, సిద్ధులను అనుగ్రహించును.

**104. ఓం శ్రీ ఆపన్నివారిణేనమః**
ఏ ఆపదలు రాకుండా తొలగించువాడు.

**105.** **ఓం శ్రీ ఆర్తి హరాయనమః**
శారరీక, మానసిక బాధలను తొలగించువాడు.

**106.** **ఓం శ్రీ శాంతమూర్తయేనమః**
శాంతి స్వరూపముగా కలవాడు.

**107.** **ఓం శ్రీ సులభ ప్రసన్నాయనమః**
సులభముగా సంతోషింపబడువాడు.

**108.** **ఓం శ్రీ భగవాన్ సత్యసాయిబాబాయనమః**
అతనే శ్రీ సత్యసాయి ప్రభువు

## షడైశ్వర్యసంపన్నుడు

6 లక్షణములు కలిగినటువంటి వానిని భగవాన్ అందురు.

1. ఐశ్వర్యము: సర్వజ్ఞుడు, సర్వాంతర్యామి, సర్వశక్తిమంతుడు
2. ధర్మ: సత్కర్మ
3. యశస్: కీర్తి
4. శ్రీ: సంపద

5. జ్ఞానము: విజ్ఞానము

6. వైరాగ్యము: మమకారము లేకుండుట.

ఈ 6 లక్షణములు కలిగిన భగవానుడు ప్రతి జీవియొక్క భూత, వర్తమాన, భవిష్యత్ కాల విషయములన్ని తెలిసిన వాడు.

## అట్టి భగవానునికి చేయు కొన్ని ముఖ్యమైన ప్రార్థనలు:

ప్రతినిత్యం తొందరగా లేచి, పడకమీద కూర్చుని చేసే చిన్న ప్రార్థన.

**'సుషుప్తిమాతా సుషువే శిశుం తత్ అహం**
**నిశ్చయం తత్ర సద్యఃకరోమి**
**యద్యత్కృతం తద్భవతు త్యదర్థం హృదిస్థితే**
**రాజ్ఞిచరాచరాణాం**
**ఉక్తం మతం దేవతథా కృతంచ హవ్యం తతః**
**పావన పూతమస్తు**

**కుర్యాం నకించిత్ పరపీడనాయ పరోపి మహ్యాం నతథా దునోతు'.**

"స్వామీ, నీవు ఇచ్చిన కార్యాన్నే ఆచరించాను. అది నీకే అర్పిస్తున్నాను. ఏవైనా తప్పులుంటే మరల అవి చేయకుండా కాపాడు".

"పరమాత్మా, నేను నిద్ర గర్భము నుంచి జన్మించాను. సకల చరాచర ప్రపంచమునకు ప్రభువై, నా హృదయ వాసివై ఉన్న నిన్నే తలచి నీ కొరకే అన్ని కార్యకలాప ములను చేయపూను కున్నాను. నీకే అర్పణముగా నేను పలికే మాటలు, తలచే తలపులు, చేసే కర్మలు పవిత్ర మొనర్చి, నా నుంచి మంచి మాటలు, మంచి తలపులు, మంచి కర్మలు వచ్చునట్లు చేసి, నేను ఎవరినీ బాధింపక, నేను బాధపడకుండునట్లు నన్ను నడిపించు", అని ప్రార్థించుట.

**అదే విధంగా నిద్రలోకి వెళ్లేటప్పుడు,** సుఖ శయన ప్రార్థన గావించుట.

**'తథా కృతం దేవః యద్దైవ కారితం**
**తథామతం దేవః యద్దైవ జ్ఞాపితం**
**తథోదితం దేవః యద్దైవ వాదితం**
**సమాప్తమత్త్వైవ విభోదిన వ్రతం"**

**"సుషుప్తె నాయయాస్మాం తద్ దేవత్వాం ప్రార్థయామహే, త్వమ త్సంగః ప్రభో ఏకం చిరశాంతి సుఖాస్పదమ్"**

"పరమాత్మా, నేనింతవరకు నీవు చేయించిన పనులను చేసాను. నీవు ప్రేరేపించిన తలపులను తలచాను. నీవు పలికించిన మాటలనే పలికాను. నేను నడచిన నడకలు, పలికిన పలుకులు, తలచిన తలపులు అన్నీ నీవే నడిపించి, పలికించి తలపించినవి. ఈ దినమున నిత్య వ్రతము సమాప్తమైనది. నన్ను ఇంక నిద్రలోనికి తీసుకో, పరమాత్మా! నాకు ఎల్లవేళలా శాంతి సుఖములను ప్రసాదించేది నీ ఒడి ఒక్కటే" అని ప్రార్థించుట.

**"భుజించేటప్పుడు (తింటున్నప్పుడు) ప్రసాదం నా ఆత్మ స్వరూపానికి అందిస్తున్నానని భావించి, ప్రార్థించి"**

**"బ్రహ్మార్పణం బ్రహ్మ హవిః బ్రహ్మాగ్నౌ బ్రహ్మణాహుతం**
**బ్రహ్మైవ తేనగన్తవ్యం బ్రహ్మకర్మ సమాధినాః**
**అహం వైశ్వానరో భూత్వాప్రాణినాం దేహమాశ్రితః**
**ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్"**

"బ్రహ్మ మన లోపలనే ఉన్నాడు కదా; భగవంతు నికి అర్పించగానే వెంటనే జవాబు వస్తుంది. 'నేను వైశ్వానర రూపంతో నీలోనే ఉండి, నీవు భుజించిన ఆహారాన్ని జీర్ణం చేస్తున్నాను' అని. "భక్తుడు భగవంతుని కర్పించు పదార్థాలు సర్వ దోషములు పరిహారమై, దోషరహితమైన ప్రసాదంగా అమృత స్వరూపంగా భక్తుని కడుపులో జీర్ణం చేస్తున్నాడు" అని అర్థం.

## "సర్వదేవతా స్వరూపిణి" గాయత్రి మంత్రము:

**"ఓం భూర్భువస్సువః తత్సవితుర్వరేణ్యం**
**భర్గో దేవస్య ధీమహి-ధీయోయోనఃప్రచోదయాత్."**

"గాయత్రి ఏదో ఒక స్త్రీ అని; శక్తివంతురాలనీ అనుకో

వటం కాదు. ఎక్కడ నీవు గానం చేస్తే అక్కడ ఉంటుంది. సర్వత్రా ఉంటున్నది. ఈమెకు గాయత్రి, సావిత్రి, సరస్వతి అని మూడు పేర్లు ఉంటున్నవి. ఇంద్రియములకు నాయకత్వం వహించునది గాయత్రి; సత్యమును పోషించేది సావిత్రి; వాగ్దేవతా (వాక్కు) స్వరూపిణి సరస్వతి. అనగా గాయత్రి ఇంద్రియములను- కర్మ (క్రియ); సావిత్రి- సత్యమును (హృదయము); సరస్వతి- వాక్కును- ఈ మూడింటినీ కర్మ, హృదయము, వాక్కులను త్రికరణ ములను శుద్ధి గావించునదే గాయత్రి.

ఈమెకు 'పంచముఖి' అని కూడా పేరు. పంచముఖి అంటే ఐదు ముఖములు కలది. ఓం- మొదటి ముఖము; భూర్భువస్సువః రెండవ ముఖము; తత్సవితుర్వరేణ్యం- మూడవ ముఖం; భర్గోదేవస్య ధీమహి- నాల్గవది; ధీయోయోనః ప్రచోదయాత్- ఇది ఐదవది.

అంతేకాక వీనిలో ఓం, భూః, భువః, సువః, తత్, సవితుర్, వరేణ్యం, భర్గో, దేవస్య- అనే తొమ్మిది (9) వర్ణనలు ఆమెకున్నాయి. ఇవి వర్ణనలు.

ధీమహి అని ధ్యానించడం, ధీయో యోనః ప్రచోదయాత్ అనేది ప్రార్థన.

ఈ మూడూ - వర్ణన, ధ్యానము, ప్రార్థన గాయత్రీ మంత్రంలో లీనమై ఉన్నాయి.

గాయత్రీ మంత్రమునందు సూర్యుని ప్రధానమైన దేవతగా నమ్ముతూ వచ్చారు.

'ధీయో యోనః ప్రచోదయాత్' సూర్య ప్రకాశము బుద్ధిలో ప్రవేశించి సూర్యుడు ప్రకాశించునట్లుగా మానవుని బుద్ధి అమితంగా ప్రకాశించాలి అని ప్రార్థిస్తూ వచ్చారు.

యజ్ఞోపవీతంలో మూడు త్రాళ్ళు చేరి ఉంటాయి. వీటి అర్థం- ప్రాతః సంధ్య, మధ్నాహ్న సంధ్య, సాయంసంధ్యా వందనాల్ని చెయ్యాలని- ఈ మూడు కాలములలో బ్రహ్మ, విష్ణు, రుద్ర స్వరూపులుగా భావించి, త్రిలోకములందు, సార్థక జీవితమును సాధించవలయుననేది గాయత్రి ప్రార్థన.

ఆ విధంగా గాయత్రి మంత్రము మానవునకు జ్ఞాన నేత్రము ద్వారా వివేకమును ప్రసాదించును. శివునకు త్రినేత్రుడని పేరు. భవిష్యత్తును కూడ చూడగల్గు త్రికాలజ్ఞుడు. అతడు మూడు శూలముల కలయికయైన త్రిశూలమును ధరిస్తాడు. మూడు ఉప పత్రముల కలయిక యైన బిల్వ పత్రముతో అతనిని పూజించే సమయంలో మనిషి తనలోని త్రిగుణాల ప్రాబల్యమును త్రిశూలముతో ఛేదించి గుణాతీతమైన చిన్మయ స్థితిని ప్రసాదించమని ప్రార్థిస్తాడు.

ఈ గాయత్రి సరియైన ఉచ్ఛారణతో జీవితాంతం జపించొచ్చు.

గాయత్రిని దేవిగా పూజించినప్పుడు స్త్రీలకు జపించు అధికారమెందుకుండదని ప్రశ్నిస్తూ, ఏ విధి నిషేధాలు లేకుండా ప్రతినిత్యం అందరూ, స్త్రీలతో సహా, ఎన్నిసార్లైనా జపించొచ్చు" అని స్వామి అన్నారు. "మీరు బస్సులో ఉన్నా, రోడ్డుమీద ఉన్నా, బజార్లో ఉన్నా, కార్లో ఉన్నా, రైల్లో ప్రయాణం చేస్తున్నా, ఎప్పుడైనా, ఎక్కడైనా సరే అది మీకు

హాని కలుగకుండా కాపాడుతుంది. పాశ్చాత్యులు గాయత్రి మంత్రము యొక్క ప్రాశస్త్యమును పరిశోధించగా వేదోక్తమైనట్లుగా స్వరబద్ధంగా ఉచ్ఛరించినపుడు వెలువడు శబ్దతరంగముల ప్రభావముచే శాంతి వలయము ఏర్పడు నట్లు కనుగొన్నారు. స్వరబద్ధంగా లేకున్న అంధకారమే తప్ప ఆ కాంతివలయం కనపడదు. మంత్రోచ్ఛారణ ద్వారా బ్రహ్మ తేజస్సు, తద్వారా జ్ఞాన ప్రకాశము పొంది మీరు కాంతి పథములలో ఉంటారు. గాయత్రి అన్నపూర్ణ, తల్లి, జీవశక్తి, అందుచేత అశ్రద్ధ చెయ్యకండి. భారతీయ సంస్కృతికి వారసులైన మీరు గాయత్రి యొక్క పవిత్ర శక్తి ప్రభావములను ఆచరణ రూపములో చాటవలసిన బాధ్యతను వహించండి" అని వటువులకు హితోపదేశం చేసారు, భగవాన్.

## పవిత్ర సాయి ఈశ్వర గాయత్రీ మంత్రము:

**ఓం, సాయీశ్వరాయ విద్మహేః**
**సత్యదేవాయ ధీమహిః తన్నః సర్వం ప్రచోదయాత్**

'సాయియే ఈశ్వరుడు. ఆ సత్య స్వరూపుని ధ్యానించు చున్నాము. ఆ పరమాత్మ మమ్ము ముక్తి మార్గంలో నడిపించ ప్రార్థన.'

స్వామి సన్నిధియందే గడుపుతూ, ప్రశాంతి నిలయములో శత వర్షములు నింపుకున్న ఋషి ఘండికోట సుబ్రహ్మణ్య శాస్త్రి. సర్వవేద సారమును గుర్తించి, మహాపండితుడై సత్యసాయి సర్వ దేవతా స్వరూపుడనే సత్యాన్ని గుర్తించి తన జీవితమును పూర్ణము గావించిన వ్యక్తి. ఆయన ముఖతః సాయి గాయత్రీ మంత్రం వెలువడింది. భగవాన్ అపూర్వ ఆమోద ముద్రతో చాలా ప్రాశస్త్యమును పొందింది.

**వక్రతుండ మహాకాయ కోటి సూర్య సమప్రభ**
**నిర్విఘ్నం కురు మే దేవ సర్వ కార్యేషు సర్వదా ॥**

వంకర తుండము కలిగినట్టియు, పెద్ద శరీరము కలిగినట్టియు, కోటి సూర్యులతో సమానమైన కాంతి కలిగినట్టియు ఓ దేవా! నాకు సర్వకార్యములయందును

ఎల్లప్పుడును విఘ్నము లేకుండ జేయుము. (ఇది విఘ్నేశ్వరుని గురించి చేయబడిన ప్రార్థన).

**యా కుందేంతు తుషారహార ధవళా యా శుభ్ర వస్త్రావృతా**
**యా వీణా వరదండమండిత కరా యా శ్వేత పద్మాసనా ॥**
**యా బ్రహ్మాచ్యుత శంకర ప్రభృతిభిర్దేవైః సదావందితా**
**సామాం పాతు సరస్వతీ భగవతీ నిశ్శేష జాడ్యాపహా ॥**

మల్లెపూవుల వలెను, చంద్రునివలెను, మంచువలెను, ముత్యాలహారము వలెను, తెల్లనైనది, తెల్లని వస్త్రములు ధరించి, శ్రేష్ఠమైన వీణయొక్క దండముతో నలంకరింప బడిన చేతులు కలది; తెల్లని పద్మము నాసనముగా కలది; బ్రహ్మ, విష్ణువు, శంకరుడు మొదలైన దేవతలచే ఎల్లప్పుడు ప్రార్థింపబడునది; అందరి మాంద్యమును పూర్తిగా హరించునట్టిది-అయిన సరస్వతి దేవి నన్ను రక్షించు గాక.

**సర్వమంగళ మాంగల్యే శివే సర్వార్థ సాధకే**
**శరణ్యే త్ర్యంబకే గౌరి నారాయణి నమోస్తుతే॥**

సర్వ మంగళములను కలదానా! శివుని భార్యా! సర్వ కార్యములను సాధించుదానా! మూడు కన్నులు కలదానా! (మూడు కన్నులు గల శివుని భార్య) శరణు పొందదగిన దానా! గౌరీ! విష్ణుసోదరీ! నీకు నమస్కారము.

**త్వమేవ మాతాచ పితాత్వమేవ**
**త్వమేవ బంధుశ్చ సఖాత్వమేవ**
**త్వమేవ సర్వం మమ దేవదేద!**

దేవదేవా! నీవే నా తల్లివి నీవే నా తండ్రివి. నీవే నా బంధువవు. నీవే నా మిత్రుడవు. నీవే నా విద్యవు (జ్ఞానమవు) నీవే నా సంపదవు (బలము, వీర్యము, శక్తి). నీవే నా సర్వస్వమును.

**ఓంకారం బిందు సంయుక్తం**
**నిత్యం ధ్యాంతి యోగినః**
**కామదం మోక్షదం చైవ**
**ఓంకారాయ నమోనమః**

యోగులెప్పుడును బిందువుతో కూడిన ఓంకారమును

ధ్యానింతురు. అది కోరికలనిచ్చును. మోక్షము నొసంగును. అట్టి ఓంకారమునకు నమస్కారము.

**గురుర్బ్రహ్మ గురుర్విష్ణు గురుర్దేవో మహేశ్వరః**
**గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మైశ్రీ గురవేనమః**

గురువే బ్రహ్మ. గురువే విష్ణువు. గురువే మహేశ్వరుడు (శివుడు). గురువు సాక్షాత్పర బ్రహ్మమే.

గురువు బాలబాలికలందలి శీలమును సవరించును (సరిదిద్దును). కావున బ్రహ్మవంటివాడు. తన శిష్యులందలి సద్గుణములను గురువు కాపాడును. కావున విష్ణువు వంటివాడు. వారియందలి (శిష్యులందలి) దురభ్యాసములను, దుర్గుణములను తొలగించును (నశింప జేయును) కావున మహేశ్వరునివంటివాడు అట్టి గురువుకు నమస్కారము.

**కరాగ్రే వసతీ లక్ష్మీః కరమధ్యే సరస్వతీ,**
**కరమూలే స్థితే గౌరీ ప్రభాతే కరదర్శనమ్॥**

వ్రేళ్ళ చివర సంపద్దేవతయైన (కార్యము-క్రియాశక్తి) లక్ష్మి

వసించును. అఱచేతి నడుమ విద్యాదేవతయైన సరస్వతి వసించును (శబ్దము- జ్ఞానశక్తి) అఱచేతి మొదట పవిత్రములైన ఆలోచనలకును సహజ ప్రతిభకును దేవతయైన (ఆలోచన-ఇచ్ఛాశక్తి) గౌరి నివసించును.

మనము నిద్రనుండి మేల్కొనగానే అఱచేతిలో ముగ్గురు పరమ దివ్యశక్తులకు చేయు ఈ ప్రార్థన భావ శబ్ద కార్యములతో సమన్వితమగును.

**హరి ర్దాతా హరి ర్భోక్తా హరి రన్నం ప్రజాపతిః**
**హరి ర్విప్రశరీరస్తు భుంక్తే భోజయతే హరిః**

సర్వలోక ప్రభువైన హరియే యిచ్చువాడు; హరియే అన్నము. హరియే అన్నమును భుజించువాడు; హరి విప్రశరీరము. భుజించువాడును, భుజింపజేయువాడును హరియే.

విప్రుడనగా దివ్యజ్ఞాన ప్రభచే ప్రకాశించు బుద్ధి కలవాడని అర్థము.

**శాంతాకారం భుజగశయనం పద్మనాభం సురేశం**
**విశ్వాధారం గగనసదృశం మేఘవర్ణం శుభాంగం**

**లక్ష్మీకాంతం కమల నయనం యోగి హృద్ధ్యానగమ్యం**
**వందే విష్ణుం భవభయహరం సర్వ లోకైక నాథమ్॥**

శాంతమైన ఆకారము కలవాడును, ఆదిశేషువు పాన్పుగా కలవాడును, పద్మము నాభియందు కలవాడును, దేవతలకు ప్రభువును, ప్రపంచమున కాధారభూతుడును, ఆకాశమువలె సర్వవ్యాపియు, మేఘము యొక్క రంగులవంటి రంగు కలవాడును, మంగళకరమైన అవయవములు కలవాడును, లక్ష్మికి భర్తయు, పద్మముల వంటి నేత్రములు కలవాడును, యోగీశ్వరుల హృదయ మందలి ధ్యానముచే పొందదగినవాడును, సంసార భయమును పోగొట్టువాడును, సర్వ లోకములకును ఏకైక ప్రభువును అయిన విష్ణువును ప్రార్థింతును.

**నమస్తేస్తు మహామాయే శ్రీపీఠే సురపూజితే**
**శంఖ చక్ర గదాహస్తే మహాలక్ష్మీ నమోస్తుతే**

ఓ మహామాయా! సంపదకు స్థానమైనదానా! దేవతలచే పూజింప బడినదానా! నీకు నమస్కారము. శంఖమును,

చక్రమును, గదయు చేతులందు కలదానా! మహాలక్ష్మీ! నీకు నమస్కారము.

**వందే శంభు ముమాపతిం సురగురుం వందే జగత్కారణం**
**వందే పన్నగభూషణం మృగధరం వందే పశూనాంపతిమ్**
**వందే సూర్యశశాంకవహ్నినయనం వందే ముకుందప్రియమ్**
**వందే భక్తజనాశ్రయంచ వరదం వందే శివం శంకరమ్**

పార్వతికి భర్తయు, దేవతలకు గురువును అయిన శంభు దేవుని ప్రార్థింతును. జగత్తునకు కారణభూతుడైన దేవుని ప్రార్థింతును. పాములు ఆభరణములుగా కలిగినట్టి, లేడి చర్మమును ధరించునట్టి దేవుని ప్రార్థించును. సర్వజీవులకు ప్రభువైన పశుపతిని ప్రార్థింతును. సూర్యుడు, చంద్రుడు, అగ్ని నేత్రములుగా కలవానిని ప్రార్థింతును. విష్ణువునకు ప్రియుడైన శివుని ప్రార్థింతును. భక్త జనుల కాశ్రయుడైన వాడును, వర్షముల నిచ్చువాడును అయిన శివుని, శంకరుని ప్రార్థింతును.

**నమస్తే అస్తు భగవన్విశ్వేశ్వరాయ మహాదేవాయ త్ర్యంబకాయ త్రిపురాంతకాయ త్రికాగ్నికాలాయ కాలాగ్నిరుద్రాయ నీలకంఠాయ మృత్యుంజయాయ సర్వేశ్వరాయ సదాశివాయ శ్రీమన్మహాదేవాయ నమః।**

సాక్షాత్తు భగవంతుడు, విశ్వమంతటికిని ప్రభువు, దేవాధి దేవుడు, త్రినేత్రుడు, త్రిపురములను దహించినవాడు, త్రికమనబడే అగ్నిని ఉపశమింపజేసినవాడు, ప్రళయాగ్ని స్వరూపుడు, నీలకంఠుడు, మృత్యువును జయించినవాడు (అమృతస్వరూపుడు), ఎల్లర హృదయముల కీశ్వరుడు, ఎల్లప్పుడుశుభముల నిచ్చువాడు మరియు సర్వసంపదల కధిదేవత యగు రుద్రునకు ప్రణమిల్లుతున్నాను.

**త్ర్యంబకం యజామహే సుగంధిం పుష్టివర్ధనమ్ ।**
**ఉర్వారుకమివ బంధనాన్మృత్యోర్ముక్షీయ మామృతాత్ ॥**

త్రినేత్రుడు, పరిమళమును వెదజల్లువాడు, మంచి పుష్టిని చేకూర్చువాడు అగు రుద్రుని మేము ఆరాధించుచున్నాము. దోసపండును తొడిమనుండి వేరు చేసినట్లు ఆ రుద్రుడు

మమ్ములను మృత్యువు నుండి వేరు చేసి (కాపాడి) అమృతత్త్వమునకు చేర్చుగాక!

**ఆదిత్యాయచ సోమాయ మంగళాయ**
**బుధాయచ, గురుశుక్రశనిభ్యశ్చ**
**రాహవే కేతవే నమః**

నవగ్రహములకు నమస్కారము

**మనోజవం మారుత తుల్యవేగం**
**జితేంద్రియం బుద్ధిమతామ్ వరిష్టమ్.**
**వాతాత్మజమ్ వానరయూధ ముఖ్యమ్**
**శ్రీరామ దూతం శిరసా నమామి.**

ఎవరు మనసుకన్న వాయువుకన్న అతి వేగముగా ప్రయాణించగలడో, ఇంద్రియములను అదుపునందుంచ గలడో, అతి సూక్ష్మబుద్ధి కలవాడో, వాయుదేవుని పుత్రుడో, వానర సేనాధిపతియో, రామదూత యైన హనుమంతునికి సాష్టాంగ నమస్కారము.

## 'అసతోమా' శాంతి మంత్రము

**'అసతోమా సద్గమయ: తమసోమా జ్యోతిర్గమయ: మృత్యోర్మా అమృతంగమయ'** అనేది మానవుడు మొదటి నుంచీ చేసే ప్రార్థన. "ఓ దేవా, బయటి ప్రపంచ సుఖాలచే ఆకర్షింపబడి, లోబడి పోయిన సమయంలో నాకు శాశ్వత సుఖశాంతుల నియ్యి. సత్యమార్గంవైపు నడిపించు' అని ఆవేదనతో చేసే అసతోమాసద్గమయ అనే శాంతి మంత్రము, "ఓ ప్రభూ! ప్రపంచ విషయ విలాసాలలో మునిగిపోయి, అజ్ఞాన అంధకారంలో కొట్టుమిట్టాడుతున్న పరిస్థితిలో ముఖ్యమైన ఆత్మతత్వమనే జ్ఞానజ్యోతిని వెలిగించు" అని తన హృదయంలో ప్రతిష్ఠింపబడి వెలుగుతూ ఉన్న భగవంతుని చిత్తశుద్ధితో చేసే ప్రార్థన, తమసోమా జ్యోతిర్గమయ: అనేది.

"ఓ దేవా! నీ అనుగ్రహంతో లోక భ్రాంతులనే చీకటి నుండి తప్పించుకొని, నిత్యమైన, సత్యమైన ఆత్మతత్వమనే జ్ఞానజ్యోతిని వెలిగించుకొని, ఇహాన్ని జయించి, పరాన్ని

పొందగల్గేటట్లు చెయ్యి" అనే సరైన మార్గం కోసం చేసే మృత్యోర్మా అమృతంగమయ అనే మూడవ ప్రార్థన. మానవుడు ఆది నుంచీ చేసే ప్రార్థన అంతంలో తన గమ్యాన్ని చేరటానికి చేసే ప్రార్థన కూడా ఇదే.

**కాయేన వాచా మనసేన్ద్రియైర్వా**
**బుద్ధ్యాత్మనావా ప్రకృతేస్వభావాత్**
**కరోమి యద్యత్సకలం పరస్మై**
**నారాయణ యేతి సమర్పయామి ॥**

నేను నా ప్రకృతి ననుసరించి శరీరముతోగాని, వాక్కుతోగాని, మనస్సుతోగాని, బుద్ధితోగాని, అంతరాత్మతో గాని యేమి చేసినను అది యెల్ల ఆ శ్రీమన్నారాయణ మూర్తికే అర్పణము చేయుచున్నాను.

# భగవాన్ బాబా అప్పుడప్పుడు అనుగ్రహించిన కొన్ని ప్రార్థనా గీతాలు

1. "కాపాడు ఓ సాయి దేవా!
నీకంటె దయ గల దేవుడు లేడింక
తప్పు త్రోవలో మునిగిపోయాను.
దుష్టత్వంతో కొట్టుకుపోతున్నాను.
ఏ సహాయము కనబడటం లేదు నాకు, ఓ సాయి!
నీ అనుగ్రహం కావాలి నాకింక.
పాలలోనే ముంచుతావో, మరి నీటిలోనే ముంచుతావో
ఏమైనా సరే నిన్ను నిందించను, దూషించను.
వచ్చావు నీవు మనిషి రూపంలో, ఈ కలియుగంలో,
తమకు తామే వేసుకున్న బంధాల సంకెళ్ల నుండి
మానవులకు విముక్తి కలిగించడానికై-
బలహీనులు భగవంతుని ఘనకీర్తిని వర్ణించగలరా?
అటువంటి వారిని బలహీన మనస్కులుగా క్షమించి
వదలి వేస్తావు నీవు.

ఎప్పుడైతే నిన్ను నేను దృఢమైన విశ్వాసంతో పుడమిపై
అవతరించిన భగవంతుని
నిజావతారంగా నిన్ను పూజిస్తానో
అప్పుడు, ఎల్లప్పుడూ నువ్వు నా వెంటే ఉంటావు.
నన్ను ఓదార్చటానికి రక్షించటానికి".

2. "నేడో రేపో కరుణించి నాకు మార్గదర్శివవుతావని
ఆశిస్తూ వేచి ఉంటాను ప్రతిరోజూ!
దర్శనమిస్తావే మోననే ఆశతో, ఇవ్వవేమోననే
బెదురుతో అప్రమత్తుడనై ఉంటాను ప్రతిగంటా!
ఈ క్షణమే నీవు నావైపే తిన్నగా వస్తావనే
ఆశతో ఎదురుచూస్తుంటాను ప్రతి క్షణమూ!"

3. దేవా, ఓ దేవా! పట్టు వదిలిపెట్టకు
వదిలి పెట్టకు నీ పట్టు ఎంత చెడ్డవాడిని నేనైనా
ఓ దేవా! వ్యర్థం కానిస్తావా నా కాలాన్ని
వ్యర్థం కానీయకు స్వామీ! నేనెంత సోమరినైనా
ఓ దేవా! పెడదారి పెట్టనీకు నన్ను స్వామీ,

పెడదారిని పోనివ్వకు నన్ను ఎంత చంచల
స్వభావిని నేనైనా
ఓ దేవా! కన్ను మరుగు కానివ్వకు నేనెంత
తుంటరినై పారిపోదలచినా!
ఎంత బాధ్యతా రహితుడనై ప్రవర్తించినా నన్ను
నీ దృష్టి  దాటిపోనివ్వకు స్వామీ!
నీ వాడినైన నన్ను కాపాడటానికి పరుగెత్తుకు
వస్తావు, నీవునా తప్పొప్పులు తులాభారం వేస్తూ
ఆలస్యం చెయ్యవు
నీ వారమైన మేము దుఃఖిస్తుంటే చూసి పట్టనట్లుగా
ఊరకుండలేవు నీవు, పేదల ప్రార్థనలకు
ప్రతిస్పందించకుండా ఉండలేవు నీవు"

4. "అనుగ్రహపు జల్లును నాపై వర్షించటానికి
నీకంటె దయామయుండు మరెవ్వరూ లేరని
గట్టిగా నమ్ముతున్నాను
ప్రభూ! ఈ నమ్మకమే కదా నన్ను నీ పాద పద్మాల
చెంతకు చేర్చింది! తెలియచెప్పు ప్రభూ!

నా ప్రార్థనకు, అభ్యర్థనకు వెంటనే బదులు ఇస్తానని గట్టిగా నమ్ముతున్నాను ప్రభూ! ఈ కారణం చేతనే కాదా నీ పాదం చెంత వేడుకొంటూ రోదిస్తున్నాను. తెలియచెప్పు, ప్రభూ!

నా ప్రక్కనే నువ్వుంటావని, సరియైన బాటలో నన్ను నడిపిస్తావని నమ్ముతున్నాను. చెప్పు, ప్రభూ! ఇందుకే కదా పగలు రాత్రి నీ చెంతనే నేనుండేది! నిన్ను నేను ఏది కావాలని కోరినా నువ్వు 'కాదు' అని అనవని నమ్ముతున్నాను. చెప్పు ప్రభూ! ఇందుకే కదా నీ కటాక్ష వీక్షణం కోసమే నీ చెంత వేచియున్నది. ఈసారి నాకోసం ఏమి సిద్ధం చేసి ఉంచావు! నీ వరాల వర్షం కురిపించ టంలో ఈ జాప్యం ఎందుకు? ఎంత కాలమైనా కానీ ఎన్నేళ్లయినా కానీ ప్రేమను వర్షించే నీ కన్నులు నావైపు తిరిగేదాకా నీకోసం, నీ కటాక్ష వీక్షణ కోసం ఎదురు చూస్తూనే వేచి ఉంటాను, నేను నీ చెంతనే"

# సామూహిక ప్రార్థన

**ఓం సహనావవతు! సహనౌభునక్తు।**
**సహవీర్యం కరవావహై !**
**తేజస్వి నావరధీతమస్తు మావిద్విషావహై!**
**ఓం శాంతిః శాంతిః శాంతిః**

ఈశ్వరుడు మనల నిరువురిని రక్షించుగాక!
అతడు మనల నిరువురిని పోషించుగాక!

మనము గొప్ప శక్తితో (దివ్య బలముతో) కలసి పనిచేయుదుముగాక! అధ్యయనముచే మన మిరువుర మును మేధా సంపదను పొందుదుము గాక!

మన మొండొరులను ద్వేషింపకుందుముగాక!
శాంతి, శాంతి, శాంతి సర్వత్ర ఉండుగాక!

ఈ వైదిక ప్రార్థన ప్రేమ, సౌభ్రాత్రము, పరస్పరావగాహనము, శాంతి, సామరస్యము అను ఉదారములైన ఆశయములను ప్రకటించును.

**సర్వే వై సుఖినః సంతు**
**సర్వే సంతు నిరామయాః**

**సర్వే భద్రాణి పశ్యంతు**
**మాకశ్చిదుఃఖమాప్నుయాత్.**
**ఓం శాంతిః శాంతిః శాంతిః**

అందఱును సుఖవంతు లగుదురు గాక!
అందఱును ఆరోగ్యవంతులు (రోగము లేనివారు) అగుదురుగాక.
అందఱును శుభములనుభవింతురు గాక.
ఎవ్వరును బాధ ననుభవింపకుందురు గాక!

## *సర్వధర్మ ప్రార్థన*

**ఓం తత్సత్ శ్రీ నారాయణతూ పురుషోత్తమ గురు తూ!**
**సిద్ధ బుద్ధ తూ స్కంద వినాయక సవితా పావక తూ ।**
**బ్రహ్మ మజ్ద తూ యహోవా శక్తితూ ఈసుపితా ప్రభు తూ!**
**రుద్ర విష్ణు తూ రామకృష్ణ తూ రహీమ తాఓతూ ।**
**వాసుదేవ గోవిశ్వరూప తూ చిదానంద హరి తూ!**
**అద్వితీయ తూ అకాల నిర్భయ ఆత్మలింగ శివ తూ ॥**
**లోకాస్సమస్తాసుఖినోభవంతు**

# మంగళ హారతి

**ఓం జయ్ జగదీశ హరే**
**స్వామి సత్యసాయి హరే**
**భక్త జనా సంరక్షక**
**పర్తి మహేశ్వరా ॥ఓం జయ్॥**

ప్రపంచములోని అజ్ఞానము, అహంకారము, దుఃఖములను హరించు జగద్రక్షకునకు జయము. భక్త జనులను సంరక్షించు హరివి నీవే సత్యసాయీ. పుట్టపర్తిలో అవతరించిన సత్యసాయి, నీకు జయము నీకు మంగళము.

**శశి వదనా శ్రీకరా**
**సర్వ ప్రాణ పతే**
**స్వామి సర్వ ప్రాణపతే**
**ఆశ్రిత కల్ప లతికా**
**ఆపద్బాంధవా ॥ఓం జయ్॥**

చందమామ వంటి అందమైన ముఖము కలవాడా, సర్వ శుభములను చేకూర్చువాడా, అన్ని ప్రాణులకు నాథుడైన వాడా, ఆశ్రయించిన వారి కోర్కెలను  ఆపదలలో నున్న వారిని ఆదుకొను బంధువా, ఓ, స్వామీ! సత్యసాయీశా, నీకు జయము. నీకు మంగళము.

**మాత పితా గురు దైవము**
**మరి అంతయు నీవే**
**స్వామి మరి అంతయు నీవే**
**నాద బ్రహ్మ జగన్నాథా**
**నాగేంద్ర శయనా ॥ఓం జయ్॥**

ఓ, స్వామీ! నీవే జగత్పితవు, జగన్మాతవు, జగద్గురుడవు, దేవ దేవుడవు. అన్నీ నీవే, సర్వము నీవే స్వామీ.

సృష్ట్యారంభమున వెలువడిన ప్రథమ ప్రణవ శబ్దమై శేషపాన్పుపై పరుండు శ్రీ మహా విష్ణుస్వరూపుడవు నీవే. అట్టి నీకు జయము. మంగళము.

**ఓంకార రూప, ఓ జస్వి,**
**ఓ సాయి మహాదేవా,**
**సత్యసాయి మహాదేవా,**
**మంగళహారతి అందుకొ**
**మందరిగిరిధారీ ॥ఓం జయ్॥**

ఓంకార రూపుడవు, తేజోబల సంపన్నుడవు, మందర గరి భారమును మోసిన నాటి కూర్మావతారుడనైన ఓ సత్యసాయి దేవా, మేమిచ్చు మంగళహారతిని అందుకో, స్వామీ! నీకు జయము, మంగళము.

**నారాయణ నారాయణ ఓం**
**సత్య నారాయణ నారాయణ నారాయణ ఓం**
**నారాయణ నారాయణ ఓం**
**సత్యనారాయణ నారాయణ ఓం**
**సత్యనారాయాణ నారాయణ ఓం**
**ఓం జయ సద్గురు దేవా.**

ఓ, ప్రభూ, సత్య స్వరూపడవు. సత్యనారాయణ స్వామివి. మా సద్గురుడవు, నీకు జయము, మంగళము.

## విభూతి మంత్రము

**పరమం పవిత్రం బాబా విభూతిం,**
**పరమం విచిత్రం లీలా విభూతిం,**
**పరమార్థ ఇషార్థ మోక్ష ప్రదాతం**
**బాబా విభూతిం ఇదమాశ్రయామి.**

బాబా విభూతి అతి పవిత్రమైనది. చిత్ర విచిత్రమైన అద్భుతశక్తి కలిగిన లీలా విభూతి. పరమార్థికమై వాంఛలను, మోక్షమును (మోహక్షయమును) కూడా అనుగ్రహించగలదా విభూతి. అలాంటి బాబా విభూతి ప్రసాదమును శరణాగతితో తీసుకొనుచున్నాను.

## శాంతి సందేశము

హిందూమతము, బౌద్ధమతము, క్రైస్తవ మతము, ఇస్లాం మతములు, జైనులు, జోరాష్ట్రీయులు మొదలగు ఎన్నో మతస్థులున్నా మానవులందరు భగవంతుని బిడ్డలే, ప్రతి ఒక్కరు, సోదరీ సోదర భావము పెంపొందించుకొని

దివ్యమైన, దైవత్వమును ప్రార్థించి ఆనందమును అనుభవించాలని ప్రచారము చేస్తూ వచ్చాయి. All are one be alike to every one అని ప్రచారము చేసిరి.

పూర్వ కాలము నుండియు భారతీయులు జగత్తునకు శాంతి భద్రతలు చేకూర్చటానికి చేసే ప్రార్థనే **'లోకాస్సమస్తా సుఖినోభవంతు'** ప్రపంచములోని ప్రతి ఒక్కరూ సుఖముగా నుండవలెను అని ప్రార్థించుచుండిరి. ఆ విధంగా ప్రపంచమందలి అన్ని కోణములలోనూ శాంతి సందేశము నందించుటచే ఒక పెద్ద ప్రశాంతి నిలయంగా విరాజిల్లగలుగుతున్నది. భారతదేశం ఈ శాంతి సందేశమును ప్రపంచ నలుదెసలా వ్యాపింపచేయు చున్నది, ఇదే సర్వమత సమ్మిళిత సాయిమతము. "మతులు మంచివైన మతమేమి చెడ్డదను" మంత్రోపదేశమేసాయి భగవానులు ఇచ్చే సందేశము. సర్వమతముల సారమే సాయి మతముగా మనం భావించాలి. అంతేకాని సాయిమతమని, సాయి మతస్తులని ప్రత్యేకం ఉన్నాయని అపోహ వద్దు. "ఏ దేశమేగినా ఈ నామమేసుమీ;

సత్యసాయీశుడనుచు నిత్యపఠన; ఏ ఊర చూచినా ఈ నామమే సుమీ, సత్యసాయీ అనుచు నిత్య జపము; ఏచోట విన్నను ఈ నామమే సుమీ, సాయిరామా అనుచు నిత్యజపము; ఎచ్చోట చూచినా ఈ నామమే సుమీ, సత్యసాయీ అనుచు నిత్య భజన; ఇట్లు విశ్వమెల్లడ వ్యాప్తియై వెలయునట్టి, భక్తజనులకు ప్రాపుయై బరగునట్టి, భక్తి నొసగి రక్షించెడు శక్తిమయుడు", పర్తివాసుడు శ్రీ సత్యసాయి భగవానుడు. సర్వమత సమన్వయమును ప్రబోధిస్తూ, ఆచరిస్తూ మానవాళిని మంచి మార్గంలో నడుపుతూ వారిని అనుసరించి వారి ప్రబోధల నాచరించే వారందరూ సాయి మతస్థులే. వారందరూ ఆచరించే సర్వమతసారమే సాయి మతము అని అందరూ గ్రహించాలి.

**అల్లాయందు మహమ్మదీయులు జహోవాయందు సత్క్రైస్తవుల్**
**పుల్లాబ్జాక్షుడటంచు వైష్ణవులు శంభుండంచుశైవుల్ సదా**
**ఉల్లాసంబున గొల్వ నెల్లరును నాయుర్భోగ భాగ్యాది సం**
**పల్లాభంబు లొసంగి బ్రోచు పరమాత్ముండొక్కడే చూడుడీ!**

ఆ విధంగా జనులు వారి వారి భక్తి ప్రపత్తుల ననుసరించి భగవంతునకు భిన్నభిన్న రూపములను, నామములను నిర్ణయించు కొనుచున్నారు. కాని సర్వమతములకు, సర్వసంప్రదాయములకు అనుగుణమైన అంగీకారయోగ్యమైన దివ్య శక్తి ఒకటున్నది. ఈ దివ్య శక్తి నుండి సృష్టి ఆవిర్భవిస్తున్నది. ఏకాత్మగల దివ్యాత్మ స్వభావం అనేకత్వంలో ఆవిర్భవిస్తున్నది. ఏకంగా గల దివ్య ప్రకృతి అనేక స్వరూపాలను అనుసరిస్తున్నది. ఈ విశ్వం సమష్టి స్వరూపం. మనుష్యుల్లో ఒక్కొక్క మతమువారు ఒక్కొక్క ఆరాధనను అంగీకరించారు. హిందువుల భగవంతుని ముస్లింలు అంగీకరించక పోవచ్చు. ముస్లింల ఆరాధనను క్రిష్టియనులు అంగీక రించకపోవచ్చు. కాని సకల మతములవారు దేహభ్రాంతిని విడిచిపెట్టి దివ్యమైన భగవతత్త్వాన్ని తెలుసుకోవాలి. అప్పుడు జనులు అనేకత్వంలోని ఏకత్వాన్ని గుర్తించి, వర్తించవీలవుతుంది.

ఇటువంటి అద్వైత సాధనకు ఉపకరించే ప్రార్థనలు, ప్రార్థన గీతాలు వీటిపై పెరిగిన ఆసక్తితో పఠించి ఆయా మంచి మతస్థులుగా మారి లోక కళ్యాణానికి పాటుపడాలి.

భగవద్గీత, బైబిలు, ఖురాను, గ్రంథసాహేబువంటి పవిత్ర గ్రంథములు పారాయణ నిమిత్తం ఆవిర్భవించలేదు. ఆచరించు నిమిత్తం అందించినట్టివి. శ్లోకాలు చదివి, వ్యాఖ్యానాలు చేయటంతో భక్తి రాదు. ఆడంబరంతో శాంతి, ఆనందం లభించవు. ఆకార మానవునికంటె ఆచార మానవుడు ముఖ్యం అని తెలుసుకోవాలి.

ఈ దేహం దేవుని వరప్రసాదం. దీనిలో దేవుడు నివసిస్తున్నాడు. ఇట్టి పవిత్ర దేహంతో మంచి కార్యాలు చేస్తుండాలి. జీవిత పరమావధి గ్రహించకుండా, లౌకిక వాంఛలు తీరడానికి తాత్కాలిక ఆవేశంతో జపాలు, వ్రతాలు, మ్రొక్కులు మొదలైన ఆడంబర భక్తి ఆత్మవంచన అవుతుంది. రోజుకు రెండు సార్లు క్రమం తప్పకుండా ప్రార్థనలు చేయడంవల్ల వ్యాధులను తట్టుకోగల శక్తి, ధైర్యం

వస్తాయి. భగవంతుని అనుగ్రహం మనశ్శాంతిని కలిగిస్తుంది. కనుక మనం నూటికి నూరుపాళ్ళు భగవంతుని మీద ఆధారపడి ఉన్నామని భావించాలి. అప్పుడు ఆయన జాగ్రత్తగా చూచుకొని, అపాయం నుండి, కష్టం నుండి కాపాడుతాడు" అని భగవాన్ బాబా హితవు హామీ చెపుతారు. అందుచే భగవంతుని అడగవలసినంది. ఇది కేవలం అర్థింపు మాత్రమే. హృదయ పూర్వక ప్రార్థన "భగవంతుడా! నాకు శాంతిని ప్రసాదించు, ఆనందాన్ని ప్రసాదించు, ప్రేమను ప్రసాదించు" అని ప్రార్థించాలి. ఆచార మానవులముగా మారుదాం అనే దీక్షతో, అనితర కృషితో అనేక ప్రార్థనలున్నా, మనలోనే మనతోనే కంటికి రెప్పలా, ఇంట, కంట, వెంట, జంట ఉంటూ, వింటుండే, అనుగ్రహించే భగవానుని శాంతిని, ఆనందాన్ని, ప్రేమను ప్రసాదించుమని ప్రార్థిద్దాం.

## 'తథాస్తు' అంటుంది దైవవాణి



మానస భజరే గురుచరణం
దుస్తరభవ సాగర తరణం
గురు మహరాజ్ గురు జై జై
సాయినాథ సద్గురు జై జై
ఓం నమశ్శివాయ  ఓం నమశ్శివాయ
ఓం నమశ్శివాయ  శివాయనమ ఓం
అరుణాచలశివ  అరుణాచలశివ
అరుణాచలశివ అరుణశివోం
ఓంకారంభవ  ఓంకారంభవ
ఓంకారంభవ ఓం నమో బాబా ॥